VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ బుధవారం 18 సెప్టెంబర్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 69




ఢిల్లీ పెద్దల మెప్పుకోసమే రాజీవ్ విగ్రహావిష్కరణ

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## హైడ్రా ఆగదు

"తెలంగాణ భవిష్యత్ రాష్ట్రంగా మాత్రమే కాదు... స్వచ్ఛమైన రాష్ట్రంగానూ ఉండాలి. ఆర్థిక, సాంస్కృతిక, పర్యావరణ పునరుజ్జీవ్మ జరగాలి. ఒకప్పుడు లేక్ సిటీగా పేరొందిన హైదరాబాద్... ఈ రోజు ఫ్లడ్ సిటీగా దిగజారిపోవడానికి గత పదేళ్ల పాలకుల పాపాలే కారణం.



# నేనేమీ ఫామ్‌హౌస్ ముఖ్యమంత్రిని కాదు

- అది ప్రకృతిని కాపాడుకునే యజ్ఞం
- ఎన్ని అడ్డంకులొచ్చినా కొనసాగిస్తాం
- రాష్ట్ర హక్కుల సాధనకు ఎన్నిసార్లైనా ఢిల్లీకి వెళ్తా
- యువత ఆకాంక్షలకు అనుగుణంగానే రాష్ట్ర పాలన
- సెప్టెంబరు 17ను వివాదాస్పదం చేయడం క్షమించరాని నేరం
- ప్రజాపాలన దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్:"తెలంగాణ భవిష్యత్ రాష్ట్రంగా మాత్రమే కాదు... స్వచ్ఛమైన రాష్ట్రంగానూ ఉండాలి. ఆర్థిక, సాంస్కృతిక, పర్యావరణ పునరుజ్జీవం జరగాలి. ఒకప్పుడు లేక్ సిటీగా పేరొందిన హైదరాబాద్... ఈ రోజు ఫ్లడ్ సిటీగా దిగజారిపోవడానికి గత పదేళ్ల పాలకుల పాపాలే కారణం. వాటి ప్రక్షాళన కోసమే హైడ్రాను ఏర్పాటు చేశాం. ఇటీవల కేరళలో ప్రకృతి విలయతాండవాన్ని చూశాం. ఆ పరిస్థితి హైదరాబాద్‌కు రాకూడదు. హైడ్రా వెనుక ఎలాంటి రాజకీయ కోణం లేదు. అదొక పవిత్ర కార్యం. ప్రకృతిని కాపాడుకునే యజ్ఞం. కొందరు భూమాఫియాగాళ్లు... పేదలను ముందు పెట్టి, హైడ్రా లక్ష్యాన్ని నీరుగార్చే ప్రయత్నంలో ఉన్నారు. ఎన్ని అడ్డంకులొచ్చినా హైడ్రా ఆగదు. హైదరాబాద్ భవిష్యత్‌కు హైడ్రా గ్యారంటీ ఇస్తుంది. ఇది నా భరోసా. ప్రజలు సహకరించాల్సిందిగా కోరుతున్నా" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విన్నవించారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం పబ్లిక్‌గార్డెన్‌లో జాతీయ జెండాను ఎగురవేసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ ప్రసంగించారు. "గత పదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేశారు. రూ.7 లక్షల కోట్ల అప్పు చేశారు. ప్రతినెలా అసలు, వడ్డీ కలిపి రూ.6 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సిన పరిస్థితుల్లో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ... ప్రజలకిచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేయడాన్ని ఒక సవాల్‌గా స్వీకరించాం.అప్పుల పునర్ వ్యవస్థీకరణకు ప్రయత్నిస్తున్నాం. కేంద్రం నుంచి రావాల్సిన ప్రతి పైసాను తెచ్చుకోవడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నాం. ఈ విషయమై నేనే స్వయంగా ఢిల్లీకి వెళ్లి.. ప్రధాని సహా కేంద్ర మంత్రులందరికీ వినతిపత్రాలు ఇస్తున్నా. నా పర్యటనల మీద విమర్శలు చేస్తున్నారు. కాలు కదపకుండా ఇంట్లో సేదదీరడానికి నేనేమీ ఫామ్‌హౌస్ ముఖ్యమంత్రిని కాదు. రాష్ట్రం నుంచి మనం పన్నుల రూపంలో కొన్ని వేల కోట్లు చెల్లిస్తున్నాం. అందులో మన వాటా తిరిగి తెచ్చుకోవడం మనహక్కు. అందుకోసం ఎన్నిసార్లైనా ఢిల్లీకి వెళ్తా" అని సీఎం స్పష్టంచేశారు. "తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి, యువ వికాసానికి, మహిళా స్వావలంబనకు, రైతు సంక్షేమానికి, బడుగు బలహీనవర్గాల సామాజిక, ఆర్థిక ఉన్నతికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉంది. సెప్టెంబరు 17... ఇకపై ప్రజాపాలన దినోత్సవం. తెలంగాణ ప్రజలే ఈ రాష్ట్ర ప్రస్థానానికి నావికులు. వారి ఆలోచనలే మా ఆచరణ. వారి ఆకాంక్షలే మా కార్యాచరణ" అని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు.

### ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణాల లబ్ధి

"మన ఆడబిడ్డలు 87 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాల లబ్ధిని పొందారు. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో కొత్త భవనాన్ని నిర్మించబోతున్నాం. ఆడబిడ్డలకు రూ.500కే వంటగ్యాస్ ఇవ్వడం ద్వారా 43 లక్షల కుటుంబాలకు మేలు చేశాం. 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్తు వినియోగమున్న 49 లక్షల ఇళ్లకు ఉచిత విద్యుత్తు ఇస్తున్నాం. ఈ ఏడాది 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించబోతున్నాం. అధికారంలోకి వచ్చిన తొలి మూడు నెలల్లోనే 30 వేల ఉద్యోగ నియామక పత్రాలిచ్చాం. గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశాం. 11,062 పోస్టులతో డీఎస్సీ నిర్వహించాం. జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ ప్రకటనలిస్తున్నాం. వచ్చే అయిదు సంవత్సరాలలో 63 లక్షల మంది ఆడబిడ్డలకు రూ.లక్ష కోట్ల రుణాలు ఇవ్వనున్నాం. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణి కేంద్రాన్ని ఏర్పాటు చేశాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, డీజీపీ జితేందర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## బుల్డోజర్ చర్యలను ఆపండి

**అక్టోబర్ 1వరకు ఆస్తులు కూల్చొద్దు**

**సుప్రీం ధర్మాసనం సిరయస్ వార్నింగ్**

**న్యూఢిల్లీ:**దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో జరుగుతున్న బుల్డోజర్ చర్యలపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సంచలన ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 1వ తేదీ వరకు కోర్టు అనుమతి లేకుండా దేశంలో ఎక్కడా ఆస్తులను కూల్చరాదని ధర్మాసనం ఆదేశించింది. అయితే ఈ ఉత్తర్వు పబ్లిక్ రోడ్లు, ఫుట్‌పాత్‌లు, ఇతర వాటిపై అనధికారిక నిర్మాణాలకు మాత్రం వర్తించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నేరాలకు పాల్పడిన వ్యక్తుల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని అధికారులు కూల్చివేస్తున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ కొందరు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించి తాజా ఉత్తర్వు జారీ చేశారు. ఇదిలా ఉంటే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న బుల్డోజర్ సంస్కృతిని ఇప్పటికే సుప్రీంకోర్టు ఖండించింది. ఇలాంటి చర్యలను గొప్పగా చేయొద్దని ప్రభుత్వాలకు వార్నింగ్ ఇచ్చింది. అయితే ఈ విషయంలో ఎన్నికల కమిషన్‌ను కూడా పిలవవచ్చని హెచ్చరించింది. మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్మూ కశ్మీర్, హర్యానాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో ఈసీకి నోటీసులు ఇస్తామని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకొంది. ఈ రాష్ట్రాల్లో చాలా చోట్ల బీజేపీ అధికారంలో ఉంది. అదే సమయంలో బహిరంగ స్థలాలు, రైల్వే ఆస్తులు, నీటి వనరుల ఆక్రమణల తొలగింపు విషయంలో మాత్రం తమ ఆదేశాలు వర్తించవని తేల్చిచెప్పింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే, సీయూ సింగ్ వాదనలు వినిపించారు. ఇప్పటికే సెప్టెంబర్ 2వ తేదీన జరిగిన వాదనల్లో దేశంలో ఎక్కడా ఈ తరహా చర్యల్లో మార్గదర్శకాలను పాటించడంలేదని పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన పిటిషనర్‌గా జామత్ ఉలేమా హింద్ వ్యవహరిస్తోంది. కూల్చివేతలకు ముందు కనీసం 40-60 రోజుల ముందుగా నోటీసులు జారీ చేయాలని, చట్ట వ్యతిరేక కూల్చివేతలకు సదరు అధికారులను బాధ్యులను చేయాలని ఆ సంస్థ సుప్రీంకు నివేదించింది. యూపీ ప్రభుత్వం పక్షాన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.




## పటేల్ కృషితోనే తెలంగాణకు విమోచనం

- ఆపరేషన్ పోలోతో విముక్తి కల్పించిన ఉక్కు మనిషి
- విమోచనోత్సవాలపై ఇంతకాలం రాజకీయం
- పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరించిన కిషన్ రెడ్డి




## ఢిల్లీ తదుపరి సీఎంగా అతిశి

ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన ఆప్

## గంగమ్మ ఒడిలో సేదతీరిన మహాగణపతి

- కన్నుల పండుగగా గణేష్ నిమజ్జనం
- భక్తుల కోలాహలంతో సందడిగా సాగరతీరం
- భారీగా తరలివచ్చి నిమజ్జనాన్ని వీక్షించిన జనం
- పోలీసుల ప్రత్యేక చర్యలతో సమయానికే నిమజ్జనోత్సవం




## బాలాపూర్ లడ్డూ మరో రికార్డు

- అత్యధికంగా 30లక్షల ఒకవేయికి వేలం
- పోటీపడి దక్కించుకున్న బిజెపి నేత కొలను శంకర్ రెడ్డి
- లడ్డూను ప్రధాని మోడీకి అంకితమిస్తున్నట్లు ప్రకటనా

2లో..



## ఢిల్లీ తదుపరి సిఎంగా అతిశి
## ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన ఆప్



**న్యూఢిల్లీ:** ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేయడంతో..ఆయన స్థానంలో అతిషీని తదుపరి సిఎంగా ఆప్ నేతలు ఎన్నుకున్నారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానని అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించిన నేపథ్యంలో తర్వాత సిఎంగా ఎవరు బాధ్యతలు తీసుకుంటారనే ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్ర మంత్రి అతిషీని ఢిల్లీ కొత్త సిఎంగా కేజ్రీవాల్ ప్రకటించారు. సిఎంగా అతిషి బాధ్యతలు చేపడతారని ఆయన వెల్లడించారు. సిఎంగా ఎవరిని నియమించాలని పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులతో కేజ్రీవాల్ చర్చించారు. అనంతరం శాసనసభా పక్ష సమావేశంలో మంత్రి అతిషి పేరును ప్రతిపాదించారు కేజ్రీవాల్.ఈ ప్రతిపాదనకు శాసనసభాపక్షం ఆమోదం తెలిపింది.ఇక, మంగళవారం సాయంత్రం కేజ్రీవాల్ సిఎం పదవికి రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది. సాయంత్రం లెఫ్ట్ నెంట్ గవర్నర్ ను కలిసి తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ కు అందజేయనున్నారు. సిఎం పదవికి రాజీనామా చేయనున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సంచలన ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ప్రజలు తనకు సర్టిఫికెట్ ఇచ్చేంతవరకూ ముఖ్యమంత్రి పదవిలో ఉండబోనని స్పష్టంచేశారు. సీఎం కుర్చీ నుంచి దిగిపోయి.. మధ్యంతర ఎన్నికలకు వెళ్లి ప్రజల్లో తన విశ్వసనీయతను పరీక్షించుకుంటానని ప్రకటించారు. మద్యం విధానానికి సంబంధించిన కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్ గతవారమే తిహాడ్ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ క్రమంలోనే మంగళవారం కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేయనున్నారు. ఈమేరకు లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) వీకే సక్సేనాను కలిసేందుకు ఆయన అపాయింట్మెంట్ కోరగా సాయంత్రం 4.30 గంటలకు సమయం కేటాయించినట్లు రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. కేజ్రీవాల్ రాజీనామాను ఎల్జీ ఆమోదించిన తర్వాత.. కొత్త సీఎంగా అతిశీ పేరును ఆప్ ఎమ్మెల్యేలు గవర్నర్‌కు సమర్పించనున్నారు. సెప్టెంబరు 26-27 తేదీల్లో ఢిల్లీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఆ సమావేశాల్లోనే అతిశీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు ఆప్ వర్గాలు వెల్లడించాయి. ఈసారి డిప్యూటీ సీఎంగా

ఎవరినీ ప్రకటించే అవకాశాలు లేవని తెలుస్తోంది. ఢిల్లీ అసెంబ్లీకి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే నవంబరులోనే మధ్యంతర ఎన్నికలు నిర్వహించాలని కేజ్రీవాల్ డిమాండు చేస్తున్నారు. అయితే, ఎన్నికల సంఘం మాత్రం ముందస్తుకు సుముఖంగా లేదని తెలుస్తోంది. ఫిబ్రవరిలోనే ఈసీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు సమాచారం.కాగా, మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్ ఇటీవలే బెయిల్ పై విడుదలయ్యారు. అయితే, బెయిల్ మంజూరు చేస్తూ.. సిఎం కార్యాలయానికి వెళ్లకూడదని, అధికారిక ÷ల్స్ పై సంతకం చేయకూడదని కేజ్రీవాల్ ను సుప్రీం కోర్టు ఆదేశించింది. దీంతో కేజ్రీవాల్ సిఎం పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే.

## పటేల్ కృషితోనే తెలంగాణకు విమోచనం



**హైదరాబాద్:** నియంతృత్వ నిజాం నుంచి ప్రజలకు విమోచన లభించిన రోజు ఇది అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పరేడ్ మైదానంలో జాతీయ జెండాను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. అమరజవాన్ల స్తూపం, సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడారు. నిజాంపై వేల మంది ప్రజలు వీరోచితంగా పోరాటం చేశారని కొనియాడారు. ప్రజల బలిదానాలు, త్యాగాల తరువాత తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. రజకార్ల మెడలు వంచడంలో దివంగత మాజీ ఉప ప్రధాని వల్లభాయ్ పటేల్‌ది సాహసోపేత పాత్ర అని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. రజాకార్ల వారసత్వ పార్టీకి కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు కొమ్ముకాస్తున్నాయని దుయ్యబట్టారు. భర్కత్ పురలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. హైదరాబాద్ విమోచనానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ విశేష కృషి చేశారని కేంద్రహోంమత్రి అన్నారు. దేశానికి స్వాతంత్యం వచ్చినా హైదరాబాద్‌కు మాత్రం వెంటనే రాలేదన్నారు. నిజాం, రజాకార్ల ఆగడాలకు.. ఆపరేషన్ పోలో ద్వారా పటేల్ ముగింపు పలికారనికొనియాడారు. పటేల్ పోలీస్ యాక్షన్‌తో నిజాం సైన్యం తలవంచిందన్నారు. పటేల్ చేపట్టిన ఆపరేషన్ పోలోతో నిజాం తలవంచారని..13 నెలల తర్వాత తెలంగాణకు స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. పటేల్ లేకపోతే హైదరాబాద్ విమోచనానికి మరింత సమయం పట్టేదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు విమోచన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నిజాం పాలన నుంచి విముక్తి లభించి 75 ఏళ్లు గడిచినా

ఎవరూ విమోచన దినోత్సవ వేడుకలు జరపడానికి ముందుకు రాలేదని కేంద్రమంత్రి అన్నారు. ఇన్నాళ్లూ ఈ వేడుకలు నిర్వహించడానికి ఏ ప్రభుత్వమూ సాహసించలేదని పేర్కొన్నారు. విమోచన దినోత్సవం నిర్వహించేందుకు అన్ని పార్టీలు భయపడ్డాయని తెలిపారు. ఈ వేడుకలను వైభవంగా నిర్వహించాలని ప్రధాన మంత్రి మోదీ ప్రకటన చేసిన తర్వాతే మిగతా పార్టీలు నిద్రలో నుంచి మేల్కొన్నాయని వ్యాఖ్యానించారు. నిజాం, రజాకార్ల ఆగడాలకు ఆపరేషన్ పోలో ద్వారా సర్దార్ పటేల్ ముగింపు పలికారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేక పోరాటంలో ఎందరో ప్రాణాలు అర్పించారు. హైదరాబాద్ స్వాతంత్యం కోసం ఎందరో సైనికులు ప్రాణాలు అర్పించారని తెలిపారు. రజాకార్లు గ్రామాల్లో హత్యలు, మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాం పాలనలో మహిళలపై లెక్కలేనన్ని ఆగడాలు జరిగాయన్నారు. జలియన్‌వాలాబాగ్ తరహా ఘటన గుండ్రాంపల్లిలో జరిగిందని.. ఆ ఘటనలో ఎంతో మంది నేలకొరిగారని పేర్కొన్నారు. తెలంగాణను పాలించిన పార్టీలన్నీ ఓటు బ్యాంకు కోసమే పనిచేశాయన్నారు. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేదన్నారు. విమోచనోత్సవాలతో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ పరిసరాలు శోభాయ మానంగా మారాయి. పోలీసుల కవాతులు, వీవీఐపీల రాక, కళాకారుల నృత్యాలతో విమోచన వేడుకలు నభూతో నభవిష్యత్ అన్నట్లుగా సాగాయి. వేడుకల్లో కళాకారులు నృత్యాలతో అలరించారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా సంప్రదాయ వస్త్రాలంకరణలో ప్రదర్శనలు ఇచ్చారు. మూడు రాష్ట్రా కళారూపకాల ప్రదర్శనతో పరేడ్ గ్రౌండ్స్ పరిసరాలు మార్మోగాయి. డప్పుదరువులు, ఒగ్గు కథలతో కళాకారులు హోరెత్తించారు.

## ఢిల్లీ పెద్దల మెప్పుకోసమే రాజీవ్ విగ్రహావిష్కరణ



హైదరాబాద్,: ఢిల్లీ పెద్దల మెప్పు కోసమే సచివాలయం ఎదుట దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని స్థాపించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం నాడు తెలంగాణ భవన్‌లో జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను మాజీ మంత్రి ఆవిష్కరించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో సోనియాగాంధీని బలిదేవత అని, రాహుల్ గాంధీని ముద్దపప్పు అని తిట్టారని.. ఇప్పుడు వాటిని కవర్ చేసుకోవడానికి రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజీవ్ గాంధీ కంప్యూటర్ కనిపెట్టాడని రేవంత్ రెడ్డి చెప్తున్నారని... కంప్యూటర్ కనిపెట్టిన ఛార్లెస్ బాబేజ్ ఆత్మ ఎక్కడున్నా బాధపడుతుందంటూ ఎద్దేవా చేశారు. మీకు చేతనైతే హామీలు అమలు చేయండి.. 420 అడ్డగోలు హామీలు అమలు చేయండి. చేతనైతే రైతుబంధు ఇవ్వండి వానాకాలంకు 14 రోజులే మిగిలింది. చేతనైతే కరెంటు సరిగా ఇవ్వండి. చేతనైతే పింఛన్లు, మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి. రేవంత్ రెడ్డి చేతనైతే మీరు ఇచ్చిన హామీలు నెరవేర్చండి అంటూ హితవుపలికారు. పోలీస్ బండ్లల్లో డీజిల్ పోయడానికి నిధులు ఇవ్వడంలేదని విమర్శించారు. రామగుండంలో రూ.2 కోట్లు డీజిల్ బిల్లులు పెండింగ్ ఉన్నాయన్నారు. అక్కడ బంకు వాళ్లు పోలీస్ బండ్లకు డీజిల్ పోయడం లేదని తెలిపారు. ఇంకో 14 రోజుల్లో వర్షాకాలం ముగుస్తుందని.. ఇప్పటికీ రైతు భరోసా ఇవ్వలేదని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే పెన్షన్ రూ.4000 అన్నారు అది లేదని.. మహిళలకు రూ. 2500 అన్నారని.. చేతనైతే అది ఇవ్వండి అంటూ వ్యాఖ్యలు చేశారు. సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు అని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి అన్నారని... 9 నెలలు అయిపోయిందని ఉద్యోగాల ప్రస్తావన లేదని... చేతనైతే ఇవ్వని చేసి చుపెట్టాలన్నారు. ఈ రాష్ట్రంలో ఇంతవరకు పాలన అనేది లేదని..కానీ రేవంత్ రెడ్డి ఇవాళ ప్రజపాలన దినోత్సవం జరుపుతున్నారని మాజీ మంత్రి మండిపడ్డారు. గురుకులాల్లో విద్యార్థులు విష ఆహారం తిని అవస్థలు పడుతున్నారని తెలిపారు. గురుకుల విద్యార్థినులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. గురుకుల టీచర్లను 2500 మందిని తీసీ పక్కన పెట్టారన్నారు. రాష్ట్రంలో పారిశుధ్యం పడకేసిందని.. ఎక్కడ చూసినా చికెన్ గున్యాలు, డెంగ్యూలు, విష జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. ప్లలెల్లో ప్రజలు దోమల బారిన పడుతున్న పిచికారి లేదన్నారు. హోంగార్డులకి జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో హెల్త్ ఎమ్జర్గ÷న్సీ పెట్టే విధంగా పరిస్థితి ఉందన్నారు. ఏ ఇంట్లో చూసినా పిల్లలు జ్వరాల బారిన పడి బాధపడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్ని సమస్యలు ఉంటే ఇవన్నీ పట్టించుకోకుండా కేవలం కేసీఆర్‌ను బీఆర్ఎస్ నాయకులను తిట్టడమే రేవంత్ రెడ్డి పనిగా పెట్టుకున్నారని కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మరోవైపు సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్త నిరసనలకు కేటీఆర్ పిలునిచ్చిన విషయం తెలిసిందే. ముందుగా తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి నిరసన తెలిపారు కేటీఆర్. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకల్లో మాజీ మంత్రులు మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు హాజరయ్యారు.

# బాలాపూర్ లడ్డూ మరో రికార్డు



**హైదరాబాద్:** బాలాపూర్ గణపతి లడ్డూ మరోసారి రికార్డు ధర పలికింది. ప్రతి సంవత్సరం కొత్త రికార్డులు సృష్టించుకొని బాలాపూర్ గణెళిష్ లడ్డూ పైపైకి వెళ్తోంది. ఈసారి కూడా అందరి అంచనాలకు తగ్గట్టుగానే పోటాపోటీగా వేలం సాగింది. కొత్తగా తీసుకొచ్చిన రూల్ ప్రకారం ముందుగా గతేడాది లడ్డూ అమ్ముడుపోయిన ధర డబ్బులు డిపాజిట్ చేస్తేనే ఈసారి వేలంలో పాల్గొనే అవకాశం ఇచ్చారు. అందుకే చాలా తక్కువ మంది ఈ డబ్బులు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నారు. గతేడాది 27 లక్షలకు లడ్డూ వేలంలో అమ్ముడుపోయింది. దీంతో ఆ 27 లక్షలు డిపాజిట్ చేసిన కొద్ది మంది మాత్రమే ఈ వేలంలో పాల్గొన్నారు. గతేడాది ఆక్షన్‌లో పాల్గొన్న దయానందరెడ్డి కూడా ఈసారి 27 లక్షలు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. పోటీలో ఉన్నది తక్కువ మంది అయినప్పటికీ పోటీ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. పోటీలో ఉన్న కొద్దిమంది లడ్డూ కోసం హోరాహోరీగా తలపడ్డారు. చివరకు 30 లక్షల ఒక వెయ్యి రూపాయలకు కొలను శంకర్‌రెడ్డి లడ్డూను సొంతం చేసుకున్నారు. గతేడాది ఈ లడ్డూను 27 లక్షల రూపాయలకు ఈయన దక్కించుకున్నారు. ఇసారి కూడా 27 లక్షలు డిపాజిట్ చేసి వేలంలో పోటీ పడి మరీ భారీ ధర చెల్లించి లడ్డూను ఇంటికి తీసుకెళ్లారు. గతేడాది లడ్డూ దక్కించుకున్న తర్వాత బాగా కలిసి వచ్చిందని అందుకే ఈసారి పోటీ పడి మరీ సొంత చేసుకున్నట్టు చెప్పుకొచ్చారు. బాలాపూర్ గణెళిశ్ లడ్డూ వేలంపాటలో ఈసారి రికార్డు స్థాయి ధర పలికింది. 30లక్షల 1000 రూపాయలకు కొలను శంకర్‌రెడ్డి దక్కించుకున్నారు. గత ఏడాది లడ్డూ రూ.27 లక్షలు పలికింది. స్థానికేతరుడైన దాసరి దయానంద్‌రెడ్డి లడ్డూను దక్కించుకున్నారు. వేలంపాట అనంతరం ఉదయం 11 గంటలకు బాలాపూర్ గణెళిశుడి శోభాయాత్ర ప్రారంభం అయ్యింది. లడ్డూను దక్కించుకున్న అనంతరం కొలను శంకర్‌రెడ్డి మాట్లాడారు. బాలాపూర్ లడ్డూ మా కుటుంబానికి దక్కడం ఇది తొమ్మిదో సారి. ఈ లడ్డూను ప్రధాని మోదీకి అంకితం చేస్తున్నానని పేర్కొన్నారు. 1994 నుంచి బాలాపూర్‌లో లడ్డూ వేలం పాట కొనసాగుతోంది. మొదట రూ.450తో ప్రారంభం కాగా.. 2016లో రూ.14.65 లక్షలు, 2017లో రూ.15.60లక్షలు, 2018లో రూ.16.60 లక్షలు, 2019లో 17.60 లక్షలు, 2021లో రూ.18.90 లక్షలు, 2022లో రూ.24.60 లక్షలు పలికింది. 2020లో కరోనా కారణంగా వేలం పాట రద్దు చేశారు. బాలాపూర్ ముఖ్య కూడలిలోని బొడ్రాయి వద్ద వేలం పాట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

# గంగమ్మ ఒడిలో సేదతీరిన మహాగణపతి



**హైదరాబాద్:** కోలాటాలు..భజనలు..తీన్మార్ స్టెప్పులు.. భాజాభజంత్రీలు...గణపతి బొప్పా మోరియా అంటూ భక్తుల నినాదాల మధ్యగణేష్ నిమజ్జనం సందడిగా సాగింది. హుస్సేన్ సాగర్ పరిసరాలు పులకించాయి. ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చి వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ క్రమంలో అనుకున్న సమయానికే ఖైరతాబాద్ మహా గణేశుడి విగ్రహ నిమజ్జనం అంగరంగా వైభవంగా జరిగింది. జయజయధ్వానాల మధ్య అంతిమ పూజలు అందుకున్న ఖైరతాబాద్ మహా గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం మంగళవారం ఒంటిగంటన్నరకు పూర్తయ్యింది. ట్యాంకుబండ్‌పై నాలుగో నెంబర్ క్రేన్ ద్వారా బడా గణపతిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఖైరతాబాద్ మహా గణపతి కోసం హైదరాబాద్ నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాలు గణపతి బప్పా మోరియా నినాదాలతో హోరెత్తాయి. మహాగణపతి నిమజ్జనాన్ని చూసి భక్తులు పులకించిపోయారు. ఖైరతాబాద్ గణపతి నిమజ్జనం వేడుకలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొన్నారు. బడా గణపతికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిమజ్జనం పూర్తి చేశారు. మంగళవారం ఉదయం నుంచి ఖైరతాబాద్ గణెళిషుడి శోభాయాత్ర అట్టహాసంగా, కన్నుల పండుగలా జరిగింది. గత సంవత్సరం నుంచి ఖైరతాబాద్ నిమజ్జన కార్యక్రమం ముందుగానే జరుపుతున్నారు. ఖైరతాబాద్ బాద్ నుంచి ఉదయం 7 గంటలకు ప్రారంభమైన సప్తముఖ మహాగణపతి శోభాయాత్ర ప్రారంభమైంది. టెలిఫోన్ భవన్, సెక్రటేరియట్, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా ట్యాంక్‌బండ్ చేరుకున్నాడు. అనంతరం వెల్డింగ్ పనులు పూర్తయిన తర్వాత.. మహాగణపతికి నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. నాలుగో నంబర్ క్రేన్ వద్ద లంబోధరుడిని నిమజ్జనం చేశారు. మహాగణపతి నిమజ్జనాన్ని తిలకించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో ట్యాంక్‌బండ్ జనసంద్రంగా మారిపోయింది. భాగ్యనగరమే కాదు దేశవ్యాప్తంగా ఖైరతాబాద్ గణెళిషుడికి ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నది. ఉత్సవాలను ప్రారంభించి 70 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఈసారి రికార్డు స్థాయిలో 70 అడుగుల ఎత్తయిన విగ్రహాన్ని ప్రతిష్టించారు. శిల్పి చిన్నస్వామి రాజేందర్ ఆధ్వర్యంలో లంబోధరుడుని రూపొందించారు. 200 మంది కార్మికులు ఒకటిన్నర రోజులు శ్రమించి గణెళిషుడిని అలంకరించారు. 11రోజులపాటు మహాగణపతిని లక్షలాది మంది భక్తులు, సందర్శకులు దర్శించుకున్నారు. ఈసారి రూ.కోటి 10 లక్షల ఆదాయం సమకూరిందని నిర్వాహకులు వెల్లడించారు. హుండీ ద్వారా రూ.70 లక్షలు రాగా, ప్రకటనలు, హోర్డింగుల ద్వారా మరో రూ.40 లక్షలు సమకూరాయి. గణెళిష్ నిమజ్జనంలో పాల్గొన్న తొలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నిలిచారు. పబ్లిక్ గా÷-డన్గ÷న్స్‌లో జరిగిన ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న రేవంత్ రెడ్డి.. అటు నుంచి నేరుగా ట్యాంక్‌బండ్ ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకున్నారు. మహాగణపతి నిమజ్జనం జరిగే క్రేన్ నంబర్ 4 వద్ద పరిశీలన జరిపారు. అక్కడి నుంచే హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జన కార్యక్రమాలను వీక్షించారు. ఇక ఉదయం నుంచే పలు ప్రాంతాల నుండి గణేష్ విగ్రహాలు ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నాయి. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య గౌరీపుత్రుని తనయుడు

గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. సూపర్ క్రేన్ ద్వారా 70 అడుగుల మహాశక్తి గణపతిని నిమజ్జనం చేశారు. అంతకుముందు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గణెళిష్ నిమజ్జనం సందర్భంగా భాగ్యనగరం సందడిగా మారింది. ట్యాంక్ బండ్ పరిసరాలు జనసంద్రంగా మారాయి. ఇసుకేస్తే రాలనంతగా భక్తులు తరలి రావడంతో ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్, తెలుగుతల్లి ఫ్లై ఓవర్, సచివాలయం, ఐమాక్స్ మార్గాలు కిక్కిరిసిపోయాయి. వేలాది విగ్రహాలు గంగమ్మ ఒడికి చేరుతున్నాయి. బుధవారం సాయంత్రానికి అన్ని విగ్రహాల నిమజ్జనం పూర్తవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా దాదాపు 25 వేల మంది పోలీసులు బందోబస్తు విధుల్లో నిమగ్నమయ్యారు. సీసీ కెమెరాలతో నిఘా తీవ్రం చేశారు. ఆకతాయిల చర్యలు అరికట్టేలా షీ టీమ్స్ బృందాలు సైతం రంగంలోకి దిగాయి. గణేష్ నిమజ్జనం సందర్భంగా మంగళ, బుధవారాల్లో నగరంలో పలు చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు అమలు అవుతున్నాయి. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున గణేష్ విగ్రహాలు హుస్సేన్ సాగర్ వైపు రానుండడంతో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నామని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. మరోవైపు, గణేష్ నిమజ్జనం ఉత్సవాల సందర్భంగా అర్ధరాత్రి వరకూ ఎంఎంటీఎస్ రైళ్ల అదనపు సర్వీసులను ద.మ రైల్వే నడపనుండగా.. ఆర్టీసీ సైతం ప్రత్యేక బస్సులు నడపనుంది. అర్ధరాత్రి 2 గంటల వరకూ మెట్రో సర్వీసులు నడుస్తాయని అధికారులు వెల్లడించారు.

## సకాలంలో నిమజ్జనం జరిగేలా చర్యలు

**హైదరాబాద్:** భాగ్యనగరంలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుగుతోందని

సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సౌత్ ఈస్ట్, సౌత్ వెస్ట్‌లో ఉన్న విగ్రహాలు త్వరగా నిమజ్జనం అయ్యేలా చూస్తున్నామన్నారు. గత ఏడాది లాగా ఆలస్యం కాకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మండప నిర్వాహకులతో మాట్లాడి నిమజ్జనం జరిగేలా చూస్తున్నామన్నారు. బాలాపూర్ వినాయకుడు కూడా త్వరగా నిమజ్జనం అయ్యేలా చూస్తున్నామని చెప్పారు. ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.


షిఫ్ట్ వారిగా 25 వేల మంది పోలీసులు బందోబస్తూ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నిమజ్జనంలో పోలీసులు అలసిపోకుండా షిఫ్ట్‌లు ప్రకారం డ్యూటీ చేస్తున్నారన్నారు. లక్ష విగ్రహాలు సిటీలో ఉండొచ్చని.. 20 నుంచి 30 వేలు విగ్రహాలు పెండింగ్ ఉన్నాయన్నారు. రేపు ఉదయంలోగా నిమజ్జనం మొత్తం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత ఏడాది లాగా కాకుండా ఈ ఏడాది త్వరగానే నిమజ్జనం అయ్యేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిమజ్జనం కోసం వచ్చే ప్రజలు పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్‌లలో రావాలని కోరుతున్నామన్నారు. మీడియాలో వచ్చే లైవ్ టెలికాస్ట్ చూడాలని ప్రజలను కోరుకుంటున్నామని సీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఈ ఏడాది వినాయక నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు. వివిధ మత పెద్దలతో రెండు సార్లు కో ఆర్డినేషన్ మీటింగ్ లెవల్ జరిగిందన్నారు. సీపీ, డీసీపీ లెవల్‌లో కూడా సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. గణెళిష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో కొనసాగిస్తామని హామీ ఇచ్చారన్నారు. బాలాపూర్ గణెళిశుడు ఇప్పటికే హైదరాబాద్ లిమిట్స్‌లో ఊరేగింపు కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బైంసాతో పాటు మరికొన్ని ప్రదేశాల్లో నిమజ్జనం పూర్తి అయిందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు, ఏర్పాట్లు చేశామన్నారు. ఈరోజు రాత్రిలోగా నిమజ్జనం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిన్న ఇన్సిడెంట్ కూడా జరగకుండా టైం టు టైం అప్రమత్తంగా ఉంటూ ముందుకు వెళ్తామన్నారు. డీజీపీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, పర్యవేక్షణ కొనసాగిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ టీవీలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కూడా పర్యవేక్షణ కొనసాగుతుందని అన్నారు. మూడు కమిషనరేట్ పరిధిలో లక్ష విగ్రహాలు నిమజ్జనం జరుగుతున్నాయన్నారు. బుధవారం వర్కింగ్ డే కాబట్టి ఈరోజు రాత్రిలోపే నిమజ్జనం అయ్యేలా చర్యలు తీసుకుంటామని డీజీపీ జితేందర్ వెల్లడించారు. షిఫ్ట్ వారీగా 25వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. నిమజ్జనంలో పోలీసులు అలసిపోకుండా షిఫ్ట్‌ల వారీగా డ్యూటీ చేస్తున్నారు. నగరంలో దాదాపు లక్ష విగ్రహాలు ఉండొచ్చు. వాటిలో 20వేల నుంచి 30వేల విగ్రహాలు పెండింగ్ ఉన్నాయి. రేపు ఉదయం లోగా నిమజ్జనం మొత్తం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. నిమజ్జనం కోసం వచ్చే భక్తులు ప్రజా రవాణాను వినియోగించుకోవాలని సీవీ ఆనంద్ తెలిపారు.

## కాంగ్రెస్ అప్పులను
## బిఆర్ఎస్ ఖాతాలో వేశారు



**మెదక్:** కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అప్పును తెలివిగా బీఆర్ఎస్ ప్రభుత్వ ఖాతాలో వేశారని రేవంత్‌రెడ్డి సర్కారుపై మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. మెదక్‌లో ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోయిందంటూ సీఎం రేవంత్, కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఈ సందర్భంగా తెలంగాణ అప్పులు- వాస్తవాలను మరోసారి ప్రభుత్వం తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. డిసెంబర్ 23న విడుదల చేసిన శ్వేతపత్రంలో నాలుగు రకాల అప్పులు చూపించారని.. రెండు రకాల అప్పులు ప్రభుత్వం చెల్లించాల్సిన అవసరం లేదని, శ్వేత పత్రలో క్లియర్‌గా మెన్షన్ చేశారన్నారు. మీరు ఇచ్చిన శ్వేతపత్రంలోనే గవర్నమెంట్ హామీలేనివి, గవర్నమెంట్ కట్టనివి రూ.59,414 కోట్లు అని చెప్పారని గుర్తు చేశారు. గవర్నమెంట్ హామీ ఉండి, గవర్నమెంట్ కట్టాల్సిన అవసరం లేనివి రూ.95,462కోట్లు అని చెప్పారని.. అంటే ప్రభుత్వం కట్టాల్సిన అవసరం లేని అప్పులు 1,54,876కోట్లు అని గుర్తు చేశారు. సీఎం చెప్పిన రూ.6,71,757 కోట్ల అప్పుల నుంచి గవర్నమెంట్ కట్టాల్సిన అవసరం లేని రూ.1,54,876 కోట్లను తీసేస్తే మిగిలిన అప్పు రూ.5,16,881 కోట్లు మాత్రమేనన్నారు. ప్రభుత్వం శ్వేతపత్రంలో రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.72,658 కోట్ల అప్పు తెలంగాణకు గత ప్రభుత్వాల నుంచి సంక్రమించింది అని చెప్పారని.. రూ.5,16,881 కోట్ల ప్రభుత్వం కట్టాల్సిన అప్పు నుంచి వారసత్వంగా వచ్చిన రూ.72,658 కోట్ల అప్పును తీసివేస్తే రూ.4,44,223 కోట్ల అప్పు ఉంటుందన్నారు. తెలంగాణ ఏర్పడక ముందు ఎస్పీవీ (స్పెషల్ పర్పస్ వెహికిల్స్)ల ద్వారా గత ప్రభుత్వాలు చేసిన అప్పు రూ.11,609కోట్లు అని తెలిపారు. ఈ మొత్తాన్ని కూడా రూ.4,44,223 కోట్ల నుంచి తీసివేస్తే.. రూ.4,32,614 కోట్లు మిగులుతుందన్నారు. శ్వేతపత్రంలో ఎఫ్ఆర్‌బీఎం అప్పులు మార్చి 31, 2024 వరకు ఉన్న బ్జడెట్ ఎస్టిమేట్స్‌ను తీసుకున్నారని.. శ్వేతపత్రం డిసెంబర్‌లోనే విడుదల చేశారనేది మనందరికీ తెలిసిందేనన్నారు.

ఈ శ్వేతపత్రంలో తెలివిగా కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న రూ.6,115 కోట్ల అప్పును బీఆర్ఎస్ ప్రభుత్వంలో జమ చేశారని.. కాంగ్రెస్ తీసుకున్న రూ.6,115 కోట్లను.. రూ.4,32,614 నుంచి తీసివేస్తే రూ.4,26,499 కోట్ల అప్పు మిగులుతుందన్నారు. అంటే తొమ్మిదిన్నరేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.4,26,499 కోట్లు మాత్రమేనన్నారు. కానీ, పదే పదే రూ.6,71,757 కోట్లు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ రూ.4.26 లక్షల కోట్లలో ఉదయం స్కీం రూ.9వేల కోట్లు, 2019-20 15వ ÷నాన్స్ కమిషన్ గ్రాంట్లను కేంద్ర ప్రభుత్వం చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పు రూపంగా రూ.2,459కోట్ల అప్పు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. దీంతో పాటు కొవిడ్ సందర్భంలో గ్రాంట్ల రూపంలో రాష్ట్రాలను ఆదుకోకుండా, అప్పులు తీసుకునే స్థితికి కేంద్రం నెట్టిందని.. అందువల్ల రూ.17,558 కోట్ల అప్పు చేయాల్సిన అనివార్య పరిస్థితి తెలంగాణకు వచ్చిందని తెలిపారు. అదే విధంగా కోవిడ్ కారణంగా 2021-22 సంవత్సరంలో జీఎస్డీపీలో ఒకశాతం అధికంగా అప్పు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ఆ మొత్తం రూ.10,784 కోట్లు అని.. తెలంగాణ రాష్ట్రం అనివార్యంగా రూ.41,159 కోట్ల అప్పు తీసుకోవాల్సిన పరిస్థితికి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు, కొవిడ్‌తో నెట్టబడిందన్నారు. ఇది ఏ ప్రభుత్వమున్నా అనివార్యంగా చేయాల్సిన అప్పు అని హరీశ్‌రావు వివరించారు.





# అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి.

## - సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, సెప్టెంబర్ 17:**



నిజం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రాంతానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కొరకు, సామాన్యులను అసమాన్యులుగా మలచి భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జరిగిన మహోత్తర పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. 1948, సెప్టెంబరు 17న రాచరిక పాలన ముగిసి భారత సమాఖ్యలో భాగమై ప్రజాస్వామిక యుగంలోకి ప్రవేశించిన సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రజాపాలనా దినోత్సవాన్ని సందర్భంగా సత్యశోధక్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్. నర్సయ్య మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజల ప్రాణ త్యాగాలను స్మరించు కుంటూ తెలంగాణ ఉద్యమంలో అసువుల బాసిన అమరవీరుల ఆశయాల సాధనకు నిబద్ధతతో ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలన్నారు. 1947, ఆగస్టు 15న యావత్ భారతదేశం స్వాతంత్ర్య సంబరాలు చేసుకుంటుంటే హైదరబాద్ సంస్థానం పేరుతో ఉన్న తెలంగాణ మాత్రం నిజాం పాలనతో, రజాకార్ల పెత్తనంతో బానిస సంకెళ్లను అనుభవించదన్నారు. ప్రత్యేక ఉద్యమాలు కేంద్ర బలగాలతో నిరంకుశ నిజాం నియంతృత్వ ధోరణిని, రజాకార్ల ఆగడాలను తుద ముట్టించి 1948, సెప్టెంబర్ 17న తెలంగగాణ స్వేచ్ఛా వాయువులు పీల్చుకుందన్నారు. దశాబ్దాల తరబడి జరిగిన ఉద్యమ నేపథ్యాల ఫలితంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధిని సాధించి జాతీయ ప్రగతికి దిక్సూచిగా ఉండడంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా అమరవీరులకు 2నిముషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిజిఎచ్ లో ప్రజా పాలన దినోత్సవం.

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్:**



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సెప్టెంబర్ 17వ తేదీ ని తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం గా జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సూపరిం టెండెంట్ డాక్టర్ ప్రతిమ రాజ్ జాతీయ జెండా ను ఆవిష్కరించి, తెలంగాణ విముక్తికై అమరులైన త్యాగమూర్తులను స్మరించుకుంటూ మౌనం పాటించి, శ్రద్ధాంజలి ఘటించారు.
ఈ కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



# నిమజ్జన శోభాయాత్రను పర్యవేక్షించిన కలెక్టర్, సీపీ.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 17**

: వినాయక నిమజ్జన శోభాయాత్రను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి పర్యవేక్షణ చేశారు. శోభాయాత్ర కొనసాగుతున్న తీరును, ఆయా ప్రాంతాలలో నెలకొన్న పరిస్థితులను వీక్షించారు. నిమజ్జనోత్సవం నేపథ్యంలో పోలీసులు, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తిస్తున్న తీరును నిశితంగా పర్యవేక్షణ జరిపారు. శోభాయాత్రకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా, అవసరమైన చోట స్థానిక పోలీసులను కమాండ్ కంట్రోల్ స్టేషన్ నుండి అప్రమత్తం చేస్తూ ఇబ్బందులు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో అట్టహాసంగా నిమజ్జన శోభాయాత్ర కొనసాగడం పట్ల కలెక్టర్, సీ.పీ జిల్లా ప్రజలకు, గణేష్ మండలి ప్రతినిధులకు ధన్యవాదాలు ప్రకటించారు. నిజామాబాద్ నగరంతో పాటు ఆర్మూర్, బోధన్ పట్టణాలు, ఇతర ముఖ్యమైన ప్రాంతాల్లో నిమజ్జనోత్సవ వేడుకలు జరుగుతున్న తీరును ఆద్యంతం పర్యవేక్షణ జరిపారు. శోభాయాత్ర సాఫీగా కొనసాగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని ఈ సందర్భంగా కలెక్టర్, సీ.పీ వెల్లడించారు. భారీ విగ్రహాలు నిమజ్జనం చేసే గోదావరి పరీవాహక ప్రాంతాలైన బాసర బ్రిడ్జి, ఉమ్మెడ వద్ద అధునాతన సాంకేతికతతో కూడిన క్రేన్లు అందుబాటులో ఉంచామన్నారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ రాజ్, ఫిషరీస్, ఫైర్ తదితర అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ నిమజ్జనోత్సవం సజావుగా జరిగేలా కృషి చేస్తున్నారని అన్నారు.

# ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు.

## - త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి.






**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 17**

: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన చైర్మన్ అనిల్, పుర ప్రముఖులకు, అధికార అనధికారులకు కలిసి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రగతిని, సెప్టెంబర్ 17 ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజనుద్దేశించి ప్రసంగించారు. ఈ వేడుకల్లో నగర మేయర్ నీతూకిరణ్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీబీ చైర్మన్ రమేష్



రెడ్డి, రాష్ట్ర సహకార ఫెడరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, అదనపు సీ.పీ కోటేశ్వరరావు, జెడ్పీ సీ.ఈ.ఓ ఉషా, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

### జెడ్పి కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పి స్పెషల్ ఆఫీసర్ హోదాలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జెడ్పీ సీఈఓ ఉషా, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సార్వజనిక్ గణేష్ మండలి వద్ద ఎమ్మెల్యేలు, కలెక్టర్, సీపీ పూజలు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 17 :**





వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో దుబ్బ ప్రాంతంలోని సార్వజనిక్ గణేష్ మండలి వద్దకు చేరుకుని పూజలు చేశారు. వినాయక నిమజ్జన శోభాయాత్ర రథం వద్ద టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు ఎమ్మెల్యేలకు, కలెక్టర్, సీ.పీ లకు సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార ఫెడరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు సైతం కలెక్టర్ తో కలిసి పూజల్లో పాల్గొన్నారు. అక్కడే గల బాలగంగాధర్ తిలక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సార్వజనిక్ గణేష్ మండలి అధ్యక్షుడు బంటు గణేష్ జెండా ఊపి శోభా యాత్ర రథాన్ని ప్రారంభించారు. అందంగా అలంకరించిన సార్వజనిక్ గణేష్ మండలి శోభాయాత్ర రథం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గణేష్ నిమజ్జనోత్సవాన్ని ఆనందో త్సాహాల నడుమ, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. శోభాయాత్రకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం తరపున అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. భారీ విగ్రహాలను గోదావరి నదిలో నిమజ్జనం చేసే యంచ, ఉమ్మెడతో పాటు అన్ని మండల కేంద్రాలలో అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. నిమజ్జోనోత్సవం సాఫీగా సాగేలా పర్యవేక్షించేందుకు సెక్టోరల్ అధికారులను నియమించామని కలెక్టర్ తెలిపారు. నిమజ్జన ప్రదేశాల వద్ద ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, సరిపడా సంఖ్యలో క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు. అన్ని శాఖలు పరస్పరం సమన్వయంతో పని చేస్తున్నాయని, బారికేడ్లు, విద్యుత్ దీపాలు వంటి వసతులు నెలకొల్పామన్నారు. నిమజ్జన శోభాయాత్రను కలెక్టరేట్ తో పాటు సీ.పీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ ద్వారా కూడా తాము పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. కాగా, శోభాయాత్ర సందర్భంగా సుమారు రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరిగేందుకు సహకరించిన ప్రజలందరికి ఈ సందర్భంగా సీ.పీ ధన్యవాదాలు తెలియజేశారు. కలెక్టర్ వెంట ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

# తెలంగాణ స్వేచ్ఛకు యావత్ సమాజం కొట్లాడింది

**ఖమ్మం:** చరిత్రలో 1948వ సంవత్సరం సెప్టెంబర్ 17వ తేదీకి ఒక విశిష్టత ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. 76 సంవత్సరాల క్రితం ఇదే రోజున మన తెలంగాణ, నాటి హైదరాబాద్ సంస్థానం రాజుల పాలన నుంచి భారతదేశంలో అంతర్భాగంగా మారి ప్రజాస్వామ్య ప్రజాపాలన దశలోకి పరివర్తన చెందిందని తెలిపారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలందరికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం నాడు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజాస్వామిక స్వేచ్ఛను పొందడం కోసం ఆనాటి యావత్ సమాజం ఉద్యమించిందని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయహస్తం హామీలను ఒక్కొక్కటిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచే అమలు చేయడం ప్రారంభించిందన్నారు. చివరి వరుసలోని పేదలకు కూడా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందే లక్ష్యంతో ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి దరఖాస్తులను స్వీకరించి అర్హులైన లబ్దిదారులకు పథకాల ఫలాలు అందించడం జరుగుతోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గ్యారెంటీ పథకాలను అందించే దిశగా జిల్లాలోని ఎంపీడీఓ కార్యాలయాలు, సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామని డిప్యూటీ సీఎం చెప్పారు. హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో రెండు గ్యారెంటీలను ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే అమలు చేసి చరిత్ర సృష్టించిందన్నారు. ఆడ బిడ్డలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని.. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకూ రాష్ట్రంలో 87.12 కోట్ల ఉచిత ప్రయాణాలు మహిళలు చేశారన్నారు. ఉచిత ఆర్టీసీ పథకం ద్వారా మహిళలకు 2958 కోట్ల రూపాయలు ఆదా చేయగలిగామన్నారు. ఈ పథకం ద్వారా ఖమ్మం జిల్లాలో మహిళలకు దాదాపు 1,79,97,210 పైగా జీరో టికెట్లను జారీ చేశామని.. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలు దాదాపు 8432.83 లక్షల రూపాయలను ఆదా చేశారని చెప్పారు. రూ. 500 కే వంటగ్యాస్ సిలెండర్ పంపిణీ ఆడబిడ్డల కన్నీళ్లు తుడవాలన్న

లక్ష్యంతో ప్రారంభించిందే మహాలక్ష్మి పథకంలోని మరో పథకం 500 రూపాయలకే వంట గ్యాస్ ఇవ్వాలన్న ఆలోచన అని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది ఫిబ్రవరి 27న ప్రారంభించామన్నారు. 40 లక్షల మంది లబ్దిదారులతో మొదలైన ఈ పథకం ప్రస్తుతం రాష్ట్రంలో 42.90 లక్షల మంది లబ్ది పొందుతున్నారన్నారు.

# గణేష్ నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించిన కలెక్టర్.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, సెప్టెంబర్ 17:**

గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో సామరస్య పూర్వకంగా నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్ అన్నారు. మంగళవారం రోజున అడ్లూర్ ఎల్లారెడ్డి (టెక్రియాల్ సమీపంలోని) చెరువులో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గణేష్ నిమజ్జనం క్రమపద్ధతిలో, సమన్వయంతో సామరస్య పూర్వకంగా నిర్వహించుకోవాలని అన్నారు. నీటి ప్రవాహంలో ఎవరిని అనుమతించకూడదని, క్రేన్ లో సహాయంతో విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. రాత్రి వేళల్లో లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలని, పోలీసు బందోబస్తు నిర్వహించాలని అన్నారు. గజ ఈతగాళ్లను అప్రమత్తంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ హిందూ ప్రియ, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఇతర మున్సిపల్, పోలీసు, ఫైర్,మత్స్య శాఖ అధికారులు,పాల్గొన్నారు.








# కాంచన సీరీస్‌లో పూజా హెగ్డే పేరు పరిశీలన



దర్శక నటుడు, నిర్మాత రాఘవ లారెన్స్ కథానాయకుడిగా వచ్చిన 'కాంచన' సిరీస్‌లో భాగంగా త్వరలో నాలుగో భాగం తెరకెక్కనుంది. ఇందులో హీరోయిన్‌గా బుట్టబొమ్మ పూజా హెగ్డేను తీసుకునేందుకు సంప్రదింపులు జరుపుతున్నారు. ఒకవైపు ఇతర దర్శకులతో కలిసి పనిచేస్తున్న రాఘవ లారెన్స్.. మరోవైపు 'కాంచన-4' స్క్రిప్టును కూడా సిద్ధం చేసుకున్నారు. ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో ఉన్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కించాలని ఆయన నిర్ణయించారు. దీనికి అనుగుణంగానే ఈ స్టోరీ విన్న తర్వాత గోల్డ్‌మైన్స్ నిర్మాణ సంస్థ ముందుకు వచ్చింది. దీంతో ఈ సంస్థతో కలిసి రాఘవ లారెన్స్ కాంచన నాలుగో భాగాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నారు. గత మూడు చిత్రాల తరహాలోనే నాలుగో భాగాన్ని కూడా ప్రేక్షకులను అలరించేలా కథను సిద్ధం చేశారు. ఈక్రమంలో ముందుగా మృణాల్ ఠాకూర్, మాళవిక మోహనన్ పేర్లు వినిపించినప్పటికీ తాజాగా హీరోయిన్‌గా పూజా హెగ్డేను తీసుకునేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. కాగా, గోల్డ్‌మైన్స్ నిర్మాణ సంస్థ అనేక తమిళ హిట్ చిత్రాలను హిందీలోకి అనువాదం చేసి విడుదల చేసింది. లారెన్స్ ప్రస్తుతం నటిస్తోన్న హంటర్ చిత్రాన్ని కూడా ఈ సంస్థే నిర్మిస్తుండడం గమనార్హం.



# పుష్ప రికార్డును దాటిన దేవర

## ఎన్టీఆర్‌కు విషెస్ చెప్పిన నటుడు సుమన్



ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'దేవర' భారీ అంచనాల మధ్య ఈనెల 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. విడుదలకు ముందే ప్రీ సేల్‌లో పలు రికార్డులు సృష్టించిన ఈ సినిమా గురించి తాజాగా నటుడు సుమన్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఎన్టీఆర్ ఎంతో అదృష్టవంతుడు. విడుదలకు ముందు ఇన్ని రికార్డులు సాధించడమంటే మాటలు కాదు. అందరి నటులకు ఇది సాధ్యం కాదు. స్టోరీ, దర్శకుడు, టీమ్ వల్ల కూడా 'దేవర'కు క్రేజ్ ఏర్పడింది. ఎన్టీఆర్ చిన్నప్పటినుంచి క్లాసికల్ డ్యాన్సర్. అందుకే ఆయన ఏ డ్యాన్స్ వేసినా గ్రేస్ ఉంటుంది. డైలాగ్స్ చెప్పడం తారక్‌కు చిన్నప్పటి నుంచి అలవాటే. వాటిలో ఆయన మాస్టర్. అలాగే ఫైట్స్‌పై కూడా ఆయనకు మంచి అవగాహన ఉంది. ఆర్టిస్ట్‌గా తెరపై ఏం చేయాలనే విషయం తారక్‌కు బాగా తెలుసు. ఎంతో అంకితభావం, నిబద్ధత ఉన్న వ్యక్తి. అందరితో చాలా స్నేహపూర్వకంగా ఉంటారు. ప్రతీ సన్నివేశాన్ని టీమ్‌తో చర్చిస్తారు. సలహాలు, సూచనలు ఇస్తారు. ఆయనతో కలిసి మరోసారి వర్క్ చేసేందుకు ఎదురుచూస్తున్నా. 'దేవర'పై భారీ అంచనాలు ఉన్నాయి. ఇది మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా అంటూ చిత్రబృందానికి సుమన్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఇప్పటికే పలు రికార్డులు తన ఖాతాలో వేసుకున్న 'దేవర'. తాజాగా మరోసారి సత్తా చాటింది. బుక్‌మైషోలో.. 'పుష్ప2'ను దాటేసింది. ఈ రెండు సినిమాలు చూడడానికి ఎంతమంది ఆసక్తి చూపుతున్నారో తాజాగా బుక్ మై షో విడుదల చేసింది. అందులో ఇప్పటివరకు 'పుష్ప2' కోసం 3 లక్షల 34వేల మంది ఆసక్తి కనపరచగా.. 'దేవర' కోసం 3 లక్షల 36వేల మంది ఎదురుచూస్తున్నారు. 'దేవర' విషయానికొస్తే.. 'జనతా గ్యారేజ్' తర్వాత హీరో ఎన్టీఆర్- డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రమిది. జాన్వీ కపూర్ ఈ మూవీతోనే టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు.

# కన్నప్ప విధేయుడు.. గుర్రం పోస్టర్ విడుదల



విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' నుంచి ప్రతీ సోమవారం విడుదల చేస్తున్న అప్డేట్ రోజురోజుకు సినిమాపై అంచనాలు పెంచుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు ఈ కన్నప్ప మూవీలో ప్రధాన పాత్రల్లో నటించిన శరత్ కుమార్, మధుబాల, దేవరాజ్, ముఖేష్ రిషి, మంచు అవ్రామ్, అర్పిత్ రంకా పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లు రిలీజ్ చేయగా అవన్నీ క్యూరియాసిటీని పెంచాయి. ఇక గత సోమవారం అక్షయ్ కుమార్ శివుడి పాత్రకు సంబంధించి ప్రీ లుక్‌ను విడుదల చేశారు. తాజాగా కన్నప్ప నుంచి విష్ణు మంచు మరో స్టన్నింగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలో తిన్నడికి అత్యంత విధేయుడైన స్నేహితుడు.. టిక్కిని పరిచయం చేశారు. అయితే ఆ స్నేహితుడు గుర్రం కావడం గమనార్హం. ఇప్పుడు ఈ గుర్రంకు సంబంధించిన పోస్టర్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. అదేవిధంగా ఈ పోస్టర్‌లో గుర్రంపై విష్ణు మంచు లుక్ అదిరిపోయేలా ఉంది.

# రజనీ స్టైల్‌కు భిన్నంగా వేట్టయాన్

## రోజురోజుకూ పెరుగుతున్న అంచనాలు



అగ్ర కథా నాయకుడు రజనీకాంత్ హీరోగా టి.జె.జ్ఞానవేల్ తెరకెక్కిస్తున్న చిత్రం 'వేట్టయాన్' అక్టోబర్ 10న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. తాజాగా దీనిపై సంగీత దర్శకుడు అనిరుధ్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన ఈ చిత్ర నేపథ్యం గురించి చెప్పారు. ఇప్పటికే రానా ఈ చిత్రంపై చేసిన కామెంట్స్ అంచనాలు పెంచగా.. తాజాగా అనిరుధ్ చేసిన వ్యాఖ్యలు వాటిని రెట్టింపు చేసి రజనీ ఫ్యాన్స్‌లో జోష్ నింపుతున్నాయి. 'వేట్టయాన్' పవర్‌ఫుల్ కథతో రానుంది. దీని స్క్రిప్ట్ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. రజనీ ఈ కథకు మరింత బలాన్నిచ్చారు. థియేటర్‌కు వచ్చిన ప్రేక్షకులు ఇందులో కొత్త రజనీకాంత్‌ను చూస్తారు. ఇప్పటివరకు ఆయన చేసిన సినిమాలన్నిటికంటే ఇది వైవిధ్యంగా ఉంటుంది. సామాజిక అంశాలు, వాస్తవ సంఘటనల ఆధారంగా దీన్ని తెరకెక్కించారు. సూపర్ స్టార్ గత చిత్రం 'జైలర్'తో పోలిస్తే ఇది పూర్తి భిన్నంగా ఉంటుంది' అని అనిరుధ్ చెప్పారు. ఈ చిత్రం గురించి గతంలో రానా మాట్లాడుతూ.. ఇది రజనీస్టైల్ సినిమా కాదని.. ఆయన ఇమేజ్‌కు పూర్తి భిన్నమైన చిత్రాన్ని మొదటిసారి ఎంపిక చేసుకున్నారని తెలిపారు. దీంతో ప్రేక్షకుల్లో దీనిపై ఆసక్తి నెలకొంది. ఈ సినిమా విషయానికొస్తే.. 'జై భీమ్' విజయం తర్వాత టి.జె.జ్ఞానవేల్ తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రమిది. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది.

# రెమ్యునరేషన్ పెంచేసిన యానిమల్ బ్యూటీ



చాలా రోజులుగా సోషల్ మీడియాను షేక్ చేస్తున్న భామల్లో టాప్‌లో ఉంటుంది తృప్తి డిమ్రి. యానిమల్ సినిమాలో అందాలు ఆరబోసి బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ బ్యూటీ అతి తక్కువ కాలంలోనే బాలీవుడ్‌లో వన్ ఆఫ్ ది బిజీయెస్ట్ హీరోయిన్‌గా మారిపోయింది. మరోవైపు బ్యాడ్ న్యూజ్ కూడా మంచి వసూళ్లు రాబట్టింది. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న ఈ భామ ఇప్పుడు బీటౌన్ దర్శక నిర్మాతలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు.ఇదిలా ఉంటే ఈ భామ తన రెమ్యునరేషన్‌ను భారీగా పెంచేసిందన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం తృప్తి డిమ్రి రూ.6 కోట్ల నుంచి 10 కోట్లకు పెంచేసిందని ఇన్‌సైడ్ టాక్. కాగా తృప్తి డిమ్రి సక్సెస్ వేవ్‌లో దూసుకెళ్తుండటంతో రెమ్యునరేషన్‌ను అమాంతం పెంచేసిందన్న వార్త నెట్టింట వైరల్ అవుతోంది. తృప్తి డిమ్రి ఖాతాలో భూల్ భులయ్యా 3, ధడక్ 2, సినిమాలున్నాయి. వీటితోపాటు పలు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి.



# మహిళా కొరియోగ్రాఫర్‌కు అల్లు అండ

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ లైంగిక వేధింపులకు గురైన మహిళకు అండగా నిలిచాడు. టాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ తనను లైంగికంగా వేధించాడంటూ ఒక మహిళ కొరియోగ్రాఫర్ హైదరాబాద్ నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ విషయంలో బాధితురాలికి అండగా నిలిచాడు అల్లు అర్జున్. తనకు ఆర్థిక సహాయం కింద ఫ్యూచర్‌లో గీత ఆర్ట్స్ బ్యానర్‌లో వచ్చే అన్ని ప్రాజెక్ట్‌లకు ఆమెను కొరియోగ్రాఫర్‌గా ఎంచుకున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. అంతేగాకుండా.. లైంగిక ఆరోపణలు ఎదుర్కోంటున్న జానీ మాస్టర్‌పై వెంటనే విచారణ వేగంగా జరిగి శిక్ష పడేలా చేయాలని అల్లు అర్జున్ ఆఫీస్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ఇక జానీ మాస్టర్ లాంటి వాళ్లని కఠినంగా శిక్షించాలని సోషల్ మీడియాలో నెటిజన్లు కోరుతున్నారు.




# జీబ్రా ఫస్ట్ లుక్ అదుర్స్

సహాయ నటుడిగా కెరీర్ ప్రారంభించి.. జ్యోతిలక్ష్మి సినిమాతో పూర్తి స్థాయి హీరోగా మారాడు సత్యదేవ్ ఆయన సినిమాలు భారీ రేంజ్‌లో హిట్లు కాకపోయినా.. ఉన్నంతలో కాస్త బెటర్‌గానే పర్‌ఫార్మ్ చేస్తుంటాయి. కెరీర్ బిగెనింగ్ నుంచి సత్యదేవ్ కథా బలమున్న సినిమాలనే చేస్తూ వస్తున్నాడు. హీరోగానే కాకుండా మధ్య మధ్యలో కీలక పాత్రల్లోనూ మెరుస్తున్నాడు. ప్రస్తుతం సత్యదేవ్ మూడు సినిమాలను లైన్‌లో పెట్టాడు. అందులో 'జీబ్రా' ఒకటి. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరిని ఆకట్టుకుంది. అయితే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రోడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఈ క్రమంలోనే తాజాగా మూవీ నుంచి విడుదల తేదీని లాక్ చేశారు మేకర్స్. ఈ మూవీని అక్టోబర్ 31న తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ మూవీలో సత్య సూర్య అనే పాత్రలో కనిపించబోతున్నాడు. యాక్షన్ క్రైమ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సత్యదేవ్‌కు జోడీగా ప్రియా భవానీ శంకర్, నటిస్తుంది. పుష్పా సినిమాతో ఫేమస్ అయిన ధనంజయ (జాలిరెడ్డి) ఈ సినిమాలో కీలకపాత్ర పోషిస్తున్నాడు. కాగా ఈ చిత్రాన్ని ఓల్డ్ టౌన్ పిక్చర్స్, పద్మ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, బాలసుందరం, దినేష్ సుందరం సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# ఘనంగా ప్రజా పాలన దినోత్సవం.

## - జాతీయ జెండా ఆవిష్కరించిన టూరిజం డెవలప్మెంట్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి.







**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, సెప్టెంబర్ 17 :**
జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఎదుట జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన దినోత్సవ వేడుకకు వచ్చిన ప్రజాప్రతినిధులకు, ఇతర ప్రముఖులకు, జిల్లా ప్రజలకు, తెలంగాణ సాయుధ పోరాట వీరుల కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటం ఫలితంగా అప్పటి వరకు పల్లెల్లో నెలకొన్న వెట్టి చాకిరి, భావవ్యక్తీకరణ పై ఆంక్షలు, మాతృభాషా అణిచివేత, మతపరమైన నిరంకుశ ధోరణులు తొలగి 17 సెప్టెంబర్ 1948న హైదరాబాద్ సంస్థానం రాజరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి మారిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో సుస్థిర ప్రజాపాలనతో సంక్షేమాన్ని పంచుతూ సర్వ మతాలను సమాదరిస్తూ శాంతిసామరస్యాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా ఆదర్శవంతమైన పల్లెలు, పట్టణాలతో ప్రభల విల్లుచున్నదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయ హస్తం హామీలను ఒక్కొక్కటిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచి అమలు చేయడం ప్రారంభించిందని చెప్పారు.
సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీఎఫ్ఓ నిఖిత, మున్సిపల్ చైర్ పర్సన్ ఇందూ ప్రియ, అధికారులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.







# చంద్రబాబు అధ్యక్షతన నేడు ఏపి కేబినేట్

**అమరావతి:** ఏపీ మంత్రివర్గ సమావేశం బుధవారం జరుగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. ఉదయం 11 గంటలకు కేబినెట్ సమావేశం జరుగనుంది. కేబినెట్‌లో కొత్త మద్యం పాలసీకి మంత్రివర్గం ఆమోద ముద్ర వేయనుంది. వచ్చే నెల 1వ తేదీ నుంచి రాష్ట్రంలో కొత్త ఎక్సైజ్ పాలసీ అమలుపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. మద్యం పాలసీపై తమ ప్రతిపాదనలను కేబినెట్ ముందు మంత్రివర్గ ఉపసంఘం ఉంచనుంది. ఉపసంఘం ప్రతిపాదనలపై కేబినెట్‌లో చర్చ జరుగనుంది. అనంతరం నూతన మద్యం పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉంది. వరదనష్టం, సహాయక చర్యలప కూడా ప్రధానంగా చర్చించనున్నారు. విజయవాడలోని అజిత్ సింగ్ నగర్, జక్కంపూడి, వాంబే కాలనీ, కండ్రిక, వైఎస్ఆర్ కాలనీ, నందమూరి నగర్, రాజరాజేశ్వరి పేట, భవానీ నగర్, ఊర్మిళానగర్‌తో పాటు రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో ఏర్పడ్డ వరద నష్టంపైనా సమావేశంలో చర్చకు రానుంది. వరదసహాయం, పంటనష్టంకు ఇచ్చే పరిహారంపై కేంద్రం నుంచి అందే సహాయంపైనా కేబినెట్‌లో చర్చించనున్నారు. ఈ నెల 20వ తారీకుతో కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు కానుండడంతో ఈ అంశంపై మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావనకు రానుంది. వివిధ శాఖలు తమ వందరోజుల ప్రణాళికల ఫలితాలపైనా సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. వివిధ మంత్రిత్వ శాఖలు ఇచ్చే నివేదికలపైన కూడా చర్చ జరుగనుంది. వరద బాధితులకు సహాయంపై కేబినెట్ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. వంద రోజుల పాలనలో మంత్రుల గ్రాఫ్‌ను వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు అందించనున్నారు. జనసేన మంత్రుల గ్రాఫ్‌ను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు సీఎం ఇవ్వనున్నారు. వరద సహాయక చర్యలలో ముఖ్యమంత్రి, మంత్రులు పనిచేసిన తీరును కేబినెట్ అభినందించనుంది. వరద సమయంలో అధికారులు పనితీరుపైనా కేబినెట్‌లో చర్చించి.. వారిని మంత్రి మండలి అభినందించనుంది. బుడమేరు గండ్లు పూడ్చడంలో మంత్రి రామానాయుడు, లోకేష్, అధికారులు చేసిన కృషిపై కేబినెట్‌లో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది.

**కొత్త మద్యం పాలసీపై చర్చించి ఆమోదం**

**వరద సాయంపైనా మంత్రివర్గంలో చర్చ**

**మంత్రుల పనితీరుపై సమావేశంలో చర్చకు ఆస్కారం**



## వివేకా హత్య కేసునుకొలిక్కి తేండి

### సీఎం చంద్రబాబును కోరిన సునీత

**అమరావతి:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందా రెడ్డి హత్య కేసును సీఐడీచే విచారణ జరిపించాలని వివేకా కూతురు వైఎస్ సునీత ఏపీ సీఎం చంద్రబాబును కోరారు. మంగళవారం సునీత దంపతులు విజయవాడలో చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ వివేకా హత్య కేసు, వైసీపీ నేతల ప్రమేయం, పోలీసుల విచారణ తదితర అంశాలను ఆమె సీఎంకు వివరించారు. వివేకా హత్యకేసులో నిజాలు రాబట్టాలని కోరారు. వివేకా పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు.. అప్పటి సీబీఐ ఎస్పీ రాంసింగ్‌తో పాటు తమపై అక్రమ కేసు పెట్టారని సీఎం దృష్టికి తెచ్చారు. కృష్ణారెడ్డి ఫిర్యాదులో నిజానిజాలపై విచారణ చేయించాలని కోరారు. రాంసింగ్‌పై కేసు వంటి అంశాలపై విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. సీఐడీ విచారణ ద్వారా వాస్తవాలు బయటకు తేవాలని కోరారు. సునీత విజ్ఞప్తిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. తనకు అన్ని విషయాలు తెలుసని.. విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు.

## తిరుమలపై పేక్ ప్రచరాలు మానుకో

### జగన్‌ను హెచ్చరిస్తూ..లోకేశ్ పోస్ట్



**అమరావతి:** తిరుమల శ్రీవారితో పెట్టుకోవద్దని వైకాపా అధ్యక్షుడు జగన్‌ను మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. విజయవాడలో మంత్రి సంధ్యారాణి ఇంట్లో జరిగిన పుట్టినరోజు వేడుకలు తిరుమలలో జరిగినట్టు ఫేక్ ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.'ఫేక్ జగన్.. నువ్వు మారవు.. నీ ఫేక్ మూకలు అస్సలు మారరు. ఫేక్ చేసీచేసి 151 నుంచి 11 సీట్లకు వచ్చావు. మంత్రి సంధ్యారాణి ఇంట్లో జరిగిన బర్త్‌డే వేడుకలు తిరుమలలో జరిగినట్లు ఫేక్ ప్రచారం చేస్తున్నావు. శ్రీవారితో పెట్టుకోవద్దు.. ఏడు కొండలపై నీ విష రాజకీయాలు వాడొద్దు. ఇదే తీరు కొనసాగిస్తే ఒక్క సీటూ లేకుండా పోతావ్' అని లోకేశ్ హితవు పలికారు.

## ప్రధానికి ఇరు రాష్ట్రాల సీఎంల శుభాకాంక్షలు

**హైదరాబాద్/అమరావతి):** మంగళవారం పుట్టిన రోజు జరుపుకుంటున్న ప్రధానమంత్రి మోదీకి తెలుగు రాష్ట్రాల సీఎంలు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి పుట్టిన రోజు శు భాకాంక్షలు తెలిపారు. ప్రధాని మంచి ఆరోగ్యంతో పాటు దేశ సేవలో దీర్ఘాయుష్షు పొందాలని ప్రార్థిస్తున్నానని సీఎం చంద్రబాబు అన్నారు. ఆయన దార్శనిక నాయకత్వంలో మన దేశం అభివృద్ధి చెందుతూనే ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా మోదీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
'గౌరవనీయులైన ప్రధాన మంత్రి జన్మదిన సందర్భంగా నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మన దేశాన్ని పురోగతి, శ్రేయస్సు వైపు నడిపించేలా ఆయనకు ఆరోగ్యం, మనోబలం సిద్ధించాలని భగవంతుణ్ణి కోరుకుంటున్నాను అంటూ సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు. మరోవైపు ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ప్రధాని మోదీకి పుట్టిన రోజు శుభకాంక్షలు తెలిపారు.

## మోడీ చలవతో పెరుగుతున్న ధరలు

విపక్షాలు విమర్శిస్తున్నా..మోడీ తన పాతధోరణిలో...మూస ధోరణిలో ముందుకు సాగుతున్నారు. దేశంలో సామాన్యులు పడుతున్న కష్టాలకు కాలం చెల్లడం లేదు. తాజాగా వంటనూనెల ధరల పెరుగుదలతో సామాన్యుడి నడ్డి విరిగింది. ఒక్క రోజులోనే లీటర్‌కు 15 నుంచి 25 రూపాయలు పెరిగాయి. ఉల్లిపాయలు 65 రూపాయలకు కిలో చేరింది. పప్పుల ధరలు మాత్రం చెప్పనక్కరలేదు. ధరలు దిగి రావడం లేదు. రూపాయి అందకుండా పోతోంది. గతంలో పైసకు ఉన్న విలువ నేటి రూపాయికి లేదు. బాలాపూర్ లడ్డూ ధర పెరిగినట్లుగా రోజురోజుకు ధరలు తాండవం చేస్తున్నాయి. అన్నపూర్ణగా ఉన్న భారత్‌లో అన్ని రకాల పంటలు పండుతున్నా సామాన్యులకు మాత్రం సరుకులు అందడం లేదు. ధరలు దకకడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మోడీ తన జన్మదినం సందర్భాగా ఇలాంటి సమస్యలు సమీక్షించుకుని ఉంటే మంచి ప్రధానిగా రాణించేవారు. కానీ పొగడ్తలకు అలవాటు పడ్డ కారణంగా క్షేత్రస్థాయిలో ఏమి జరుగు తుందో తెలుసుకోలేక పోతున్నారు. ఉద్యోగ ఉపాధి రంగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బిజెపి నేతలు కూడా మోడీ భజనలో మునిగి పోయారు. సమస్యలు తెలుసుకోవడం...తెలుసుకున్న సమస్యలను ప్రధానికి వివరించడం అన్నది లేకుండా పోయింది. అంతెందుకు ఎపిలో కేంద్రమంత్రులుగా ఉన్న రామ్మోహన్ నాయుడు వంటి వారు రాష్ట్రానికి ఏం చేద్దామా అని ఆలోచించి, నిధులు విడుదల చేయించుకుని అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారు. కానీ తెలంగాణలో ఉన్న ఇద్దరు కేంద్రమంత్రులు కిసన్ రెడ్డి, బండి సంజయ్‌లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టి పోయడానికే సమయం తీసుకుంటున్నారు.

సామాన్యులు సమస్యల్లో చిక్కుకుని ఏడుస్తుంటే..ఆదానీ, అంబానీ లాంటి వారు మాత్రం ఆస్తుల్లో ఎవరెస్ట్ అంత ఎత్తుకు చేరిపోతున్నారు. వారి ఆస్తులు అమాంతంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలను వారికి అప్పగించే పని ఆగడం లేదు. వడ్డించే వాడు మనవాడైతే ఏ బంతిలో కూర్చుంటే ఏమిటి ? అన్న సామెత ఇప్పుడు మన దేశ కుబేరుల్లో ముందు వరసలో ఉన్న ఆదానీకి బాగా సరిపోతుంది. ఎందుకంటే ఆయన చేసే వ్యాపారం కన్నా.. పొందుతున్న సహకారం వల్లనే ఈ స్థాయికి చేరారని చెప్పడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. ఆసియా కుబేరుడు గౌతమ్ అదానీ సంపదలో మరో మెట్టు ఎక్కడంలో ఆయన వెనక ఎవరున్నారు..ఎవరు సహకారం అందిస్తున్నారో దేశంలోని సామాన్యులకు కూడా తెలుసు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించుకున్న గంగవరం పోర్టు, నెల్లూరులోని పోర్టులు అన్నీ ఆదానీ పరం అయ్యాయి. గత జగన్ ప్రభుత్వం దగ్గరుండి వాటిని ఆదానీకి కట్టబెట్టారు. ఇదంతా మోడీ చలవ వల్లనే అని వేరుగా చెప్పనక్కరలేదు. గంగవరం పోర్టుకోసం భూములు ఇచ్చి త్యాగం చేసిన జాలర్లు ఆగమయ్యారు. గంగవరం పోర్టుతో పాటు విశాఖ ఉక్కును కూడా మోడీ ప్రభుత్వం అప్పనంగా కార్పేరేట్లకు కట్టబెట్టే ఆలోచన చేశారు.